# ప్రేమదంపతులు

శ్రీ గోపేటి బాబూరావు

ఆ రోజు శనివారం. కాలేజీ విడిచిపెట్టారు. కార్ల మీదను, సైకిళ్లమీదను, బండ్లమీదను విద్యార్థులు వారి ఇండ్లకు పోతున్నారు. రాధ కాలేజీ గేటు దగ్గ నిలబడి నలువైపులా తన బండికోసం చూస్తూంది. తనతోటివారు అంతకుముందే వెళ్లిపోయారు. ఎంతసేపటికి తన బండి రాకపోవటంవల్ల దగ్గరగానున్న రిక్షావాలాను పిలచి రిక్షాలో తన ఇంటికి బయలుదేరింది.

కాలేజీకి రాధ ఇంటికి చాలా దూరముంది. రిక్షావాలా రిక్షాను తన శక్తికొలది లాగుతున్నాడు. సగందూరం వచ్చేశారు. ఇంతలో వెనుకనుంచి కారొక టి అతివేగంతో వస్తూంది. రిక్షావాలాకి దాని అలికిడి ఏమీ వినపడక మామూలు వేగంతో పోతున్నాడు. కారు దగ్గరకువచ్చి సింహంలా గద్దించేటప్పటికి ఆలోచనా నిమగ్నుడైయున్న, వానికి ఒక్కసారి ఒళ్లు ఝల్లుమంది. శరీరం బరువెక్కినట్లయింది. కళ్లు చీకట్లు క్రమ్మాయి. తాను రిక్షాను లాగుచున్నదే మర్చిపోయి ప్రక్కనున్న రాళ్లగుట్టపై ఎక్కించివేశాడు. రిక్షాతో సహా రాధ స్పృహతప్పి రాళ్లగుట్టపై పడిపోయింది. ఈదృశ్యం వెనుక కారులోనున్న మోహన చూచి కారు ఆపి రాధచెంతకు వెళ్ళి ఆమెను ఆస్పిటలుకు తీసికొని వెళ్ళుటకు తన కారులో కూర్చోపెట్టుకున్నాడు. అజాగ్రత్తతో లాగుచున్న రిక్షావాలా పేరును వ్రాసికొని వెళ్ళిపోయాడు.

ఈసంగతి రాధ మేనమామగారు అగు సుందరంగారికి తెలిసి ఆదుర్దాతో ఆస్పిటలుకు వచ్చాడు. రాధను చూచిన తరువాత మనస్సు కొద్దిగా స్థిమిత పరచుకొన్నాడు. కాని పరాయి పురుషుడు యౌవ్వనంలోవున్న స్త్రీ దగ్గర కూర్చుండుటకు యిష్టపడక మోహనుని మంచి మాటలతో ఇంటికి పంపాడు. రాధను విడచి వెళ్ళుటకు మోహనున కెందుకో మనస్సొప్పలేదు కాని ఏంజేస్తాడు వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

మోహను ఇంటరు ప్యాసు అవుటతోడనే— మన దేశమును పీల్చి పిప్పిచేసిన ఈ పైశాచిక విద్య అని విరక్తి కలిగింది. అతనొక ధనికుని బిడ్డ. తల్లి చిన్నతనంలోనే మరణించింది. తండ్రి ద్వితీయ వివాహం చేసికొన్నాడు. కుటుంబము సఖ్యంగానే ఉంది. కాని ఎప్పటికైనను సవతితల్లి—సవతితల్లిగే— వారు పయోముఖ విషకుంభములాంటి వారు. మోహనుడు ఎవ్వరి జోక్యములేక నిశ్చింతగా కాలం గడుపుతున్నాడు.

◆ ◆ ◆

మోహను ఆస్పిటలునుండి వచ్చిన తర్వాత మతిపోయినట్లా ఉంది. వాని కళ్ళకు రాధ ప్రేమస్వరూపిణిలా కనపడుతూంది. ఆమెను తలచుకొంటూ అకస్మాత్తుగా నిద్రదేవతా ఒడిలో జార్లబడ్డాడు.

తెల్లవారింది సూర్యుడు తన రజిత కిరణములను మోహను కోమలముఖముపై ప్రకాసింపజేస్తూ వానిని నిద్రనుండి మేల్కొలుపుతున్నాడు. మోహను వాని ఆదరణకు ఆదుర్దాగా లేచి కాలకృత్యములు తీర్చుకొని రాధను చూడడానికి ఆస్పిటలుకు వెళ్లిపోయాడు. అతను వచ్చేటప్పటికి రాధ నిద్రనుండి లేవలేదు. ఆమె దగ్గర ఎవరూ లేకపోవుటచూచి ఆశ్చర్యపడి తాను దగ్గరగానున్న కుర్చీలో కూర్చొన్నాడు.

ఇంతలో సుందరంగారు ఫ్లాస్కుతో కాఫీ తీసికొని వచ్చారు. మోహను వారికినమస్కరించి రాధకు ఏలా ఉన్నది అడిగి త్వరగా వేడి కాఫీ ఇమ్మన్నాడు. అలికిడి విన్న రాధ నిద్రనుండి లేచి ముఖప్రక్షాళనం ముస్నగునది చేసి కాఫీ త్రాగింది. జరిగిన సంగతి తన మేనమామగారివల్ల తెలిసికొంది కనుక తనప్రాణములను కాపాడిన మోహనునకు అనేక ధన్యవాదాలు అర్పించింది.

◆ ◆ ◆

కాలం ఎప్పుడు ఒక విధంగా ఉండదు అది అనేక రూపాలు పొందుతూ ఉంటుంది. రాధపూర్వము వలె ఆరోగ్యవతి అయింది. ఆమె మోహనుని చూచి నప్పటినుండి వాని రూపం మనస్సున నిలచిపోయింది. వానిని మనస్సారా ప్రేమించింది. వానితో సంసార నౌకయందు ప్రయాణం చేయవలెనని దృఢ నిశ్చయం చేసికొంది.

మోహనునకు రాధను ఎన్నిమారులు చూచినా మనస్సునకు తృప్తికలుగుటలేదు. అతనుకూడా ఆమెను ప్రేమించాడు.

ఈవిధంగా వారి ప్రేమ శుక్లపక్షంనాటి చంద్రునివలె దినదినప్రవర్ధమానమవుతోంది. రాధా మోహనులు రెండు మూడు రోజులకొక పర్యాయం కలసికొని ఆనందముగ ముచ్చటించుకొనెడివారు. కాని వారి ప్రేమను వెలిబుచ్చుటకు ఒకరికొకరు జంకుచుండెడివారు.

చివరకు మోహన్ ధైర్యించి తన ఉద్దేశ్యమును తెలుపుటకై ఒకరోజున రాధ పూలతోటలో నొంటరిగనుండగ వెళ్లాడు, ఇద్దరు దగ్గరనున్న రాతి తిన్నెపై కూర్చొని మాట్లాడుచుండగా మాటల సందర్భమున మోహను జంకుతూ తన ప్రేమను వెలిబుచ్చాడు. రాధ కూడా తన ఆశయాన్ని గుప్తపరచగా పైకిచెప్పివేసింది. మోహను ఆనందముతో రాధను కౌగిలిలో జేర్చుకొని అప్రయత్నంగా ఆమె అధరములపై తనివితీరా చుంబనము చేశాడు. ఇద్దరికి నొక్కమారు శరీరము ఝల్లుమంది. ఇంతలో వారి ఆనందమును భగ్నపరచుటకు రాధ మేనమామ వారి వెనుకవచ్చి నిలబడ్డాడు. రాధా మోహనులు వానిని చూచినతోడనే నిర్జీవ ప్రతిమలైపోయారు. తక్షణం యెవరి త్రోవ వారు వెళ్ళిపోయారు.

♦ ♦ ♦

మరుసటి రోజునుంచి సుందరం రాధకు పెండ్లి సంబంధములు మాడ ప్రారంభించారు. చివరకు రెండవ పెండ్లివానికి కట్టబెట్టుటకు నిశ్చయపరచుకొని ముహూర్తం ఏర్పాటు చేశారు. ఈ సంగతి రాధ విని మేనమామతో ఈ పెండ్లి వద్దని అనేకమార్లు ప్రార్థించింది—తన మనస్సును ఇదివరకే ఒకరికి ఆధీనపరచానన్నది—వానినే పెండ్లిచేయమంది. కాని కఠిన మనసు కల సుందరం ఆమె మాటలు పెడచెవిని బెట్టి తన ఇష్టము వచ్చినట్లు చేస్తానన్నాడు.

రాధ చేయునది లేక ఈపాడు ప్రపంచములో ఉండుటకన్న చస్తే మేలని తలచి మోహానునకు కడసారి వందనములు అర్పిస్తూ వానికి నొక ఉత్తరం అందజేసి సుందరం పేర నొక ఉత్తరం వ్రాసి ఆ రాత్రే రహస్యముగా నదీతీరానికి ఆత్మహత్యకై బయలుదేరి వెళ్లింది.

శశాంకుడు రాధచేయు సాహసకార్యము చూడలేక గాబోలు మేఘములచాటుకు పోతున్నాడు. నద అంతయు ప్రశాంతంగా ఉంది. చుట్టుప్రక్కల చెట్ల గుంపులనుండి పక్షులు కిలకిలా రావములు చేస్తున్నాయి. వాటిధ్వనులు రాధ మనస్సును మరింత కలవరపెట్ట సాగాయి. రాధ భగవంతుని ప్రార్థిస్తూ మరుసటి జన్మకైనను మోహానునే భర్తగా జేయమని వేడుకొంది, మోహన్‌ను జపిస్తూ ఒక్కసారిగా నదిలో దుమికింది.

ఇంతలో ఎట్పుటనుండో మోహన్ పరిగెత్తుకొనివచ్చి నదిలోపడిన రాధను గట్టుపైకితీసి తనఒడిలో పరుండబెట్టికొని శైత్యోపచారములు చేస్తున్నాడు. ఆసమయముననే సుందరం మరికొందరు బంధువులు పరుగెత్తుకొని మోహన్ వున్నచోటుకు వచ్చారు. "రాధకు మరేమీ ప్రాణభయం లేదని" మోహన్ ఆయాసంతో చెప్పాడు. తక్షణమే ఆమెను ఆస్పిటలుకు తీసికొని వెళ్ళారు. కొంతసేపటికి రాధకు స్మారకం వచ్చింది.

సుందరం అప్పటికి వారి నిష్కల్మష ప్రేమతత్వం బోధపడింది. వారినే భార్యాభర్తలుగా చేయవలెనని నిశ్చయం చేసికొని రాధా మోహానులతో తన ఆశయాన్ని వెలిబుచ్చి వారిని ఆనందపరవశులనిగా చేశాడు.

రాధా మోహానుల వివాహం ఐదు రోజులు కన్నువుల పండువుగ జరిగింది. అనేకమందిని పెండ్లికి ఆహ్వానించి గొప్ప విందుచేశారు.

రాధా మోహానులు, ప్రథమమున తమ ప్రేమ బీజమును నాటింపజేసిన రిక్షావాలాను ప్రత్యేకముగ విందునకు అహ్వానించి బహుమాన పూర్వకముగా వంద రూపాయలు ఇచ్చారు.

రాధా మోహానుల ప్రేమబీజము వృక్షమై మొగ్గలుదొడిగి ఇప్పటికి ప్రేమపుష్పముగా వికసించి వారిని ఆనంద డోలికలలో అఘ్రాణింప జేస్తోంది

"కథాంజలి"
అన్ని హిగ్గిన్ బాతమ్సు రైల్వే బుక్ స్టాల్సులోను దొరుకుతుంది.